క్లుప్తంగా

నరసింహ అవతారంలో భజేనారాయణస్వామి



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: మండలంలోని వడిశలేరులో వేంచేసియున్న భజేనారాయణస్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని దశావతారాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని నరసింహ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై నరసింహ అవతారంలో ఉన్న స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం వామన అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబు రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ మావిరెడ్డి నెహ్రూ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యమవుదాం

ఎస్సీ, ఎస్టీ నేత నీరుళ్ల రాజేష్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నీరుళ్ల రాజేష్

మధురపూడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కుల సాధనలో ఐక్యంగా ముందుకు సాగాలని ఎస్బీఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, అధికారుల సంక్షేమ సంఘం జోనల్ సెక్రటరీ నీరుళ్ల రాజేష్ అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం గాడాల శివారు తోటల్లో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం సంఘం నిర్విరామంగా కృషి చేస్తోందన్నారు. సంఘ కార్యక్రమాలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పైల ప్రసాద్, చొప్పల రాజశేఖర్, జయచంద్ర, ఐ.శ్రీను, వేణు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు

పెదపూడి: గొల్లల మామిడాడలో కొలువైన ఉషా ఛాయా పద్మిని సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భాషా పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు స్వామీజీ తదితరులు

సీటీఆర్ఐ: అన్ని విధాలుగా భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాధిపతి డాక్టర్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్తాధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలలో జనవరి 5, 6, 7 తేదీల్లో రెండో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. దీని పోస్టర్‌ను ఆదివారం స్థానిక సుమేధ క్యాంపస్ కార్యాలయంలో చిన్న వెంకన్నబాబు స్వామీజీ ఆవిష్కరించారు. భాష నాగరికతకు పునాది వంటిదని, భాష ఉన్నంత కాలం సంస్కృతి సుసంపన్నంగా ఉంటుందన్నారు. భాష మరుగున పడితే, సంస్కృతీ, సంప్రదాయాలు మరుగున పడిపోతాయన్నారు. మహాసభలు విజయవంతం అయ్యేందుకు సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ముఖ్య సంచాలకులు కేశిరాజు రాంప్రసాద్, శోభాయాత్ర సంచాలకులు సుమేధా వెంకటరాజు, కల్యాణ్, వివిధ సంస్థల ప్రతినిధులు మతాల రమేష్, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- మెట్టలో పెరుగుతున్న విస్తీర్ణం
- పట్టణాలకు ఎగుమతి



వడిశలేరులో మిరప తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు



రంగంపేటలో టమాటా పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో ఒకప్పుడు వరి, పత్తి, పొగాకు వంటి పంటలపై ఆధారపడిన రైతులు ఇప్పుడు లాభాలు ఆర్జించే పంటలపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరి, పత్తి, మినుము పంటలతో రైతులు నష్టపోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటలపై మక్కువ పెంచుకుంటున్నారు. అందుకే మండల పరిధిలో రంగంపేట, వడిశలేరు, చండ్రేడు, పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, సుభద్రంపేట, ముకుందవరం, దొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను తదితర గ్రామాల్లో కూరగాయల పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

మంచి గిరాకీ

ఒకప్పుడు పొలం గట్లకే పరిమితమైన కూరగాయల సాగు ప్రస్తుతం మండలంలోని సుమారు 1099 ఎకరాల్లో జరుగుతుంది. పెట్టుబడి ఎక్కువైనా నష్టం పెద్దగా ఉండదనే నమ్మకంతో రైతులు కూరగాయల సాగును ఎంచుకుంటున్నారు. పండించిన కూరగాయలను స్థానికంగా అమ్ముకోవడమే కాకుండా రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు తదితర పట్టణాలకు తరలించి విక్రయించి లాభాలు పొందుతున్నారు. ప్రధానంగా అధిక వర్షాల సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల దిగుమతులు తగ్గిపోవడంతో స్థానికంగా పండించే పంటలకు మంచి గిరాకీ ఏర్పడుతుంది. దీంతో చాలామంది రైతులు వరి పంటకు బదులు కూరగాయలు, ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు.

మార్కెట్‌లో ధరలను బట్టి లాభాలు

మండలంలో ఎక్కువగా బీర, బెండ, దొండ, ఆనప, మిరప, వంగ, చిక్కుడు, గోరు చిక్కుడు, కాకర, గుమ్మడి, కర్రపెండలం తదితర కూరగాయ పంటలతో పాటు ఆకు కూరలైన తోటకూర, గోంగూర, పాలకూరలు సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుకి ఎకరానికి సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ పెట్టుబడి అవుతుంది. వీటికి ఎటువంటి తెగుళ్లు వ్యాపించకుండా ఉంటే ఎకరానికి అంతే మొత్తంలో లాభాలొచ్చే అవకాశముంటుంది. మార్కెట్‌లో ధరలను బట్టి లాభాలు మారతుంటాయి.

కూరగాయల పంటలకు రాయితీలివ్వాలి



వరి సాగులో ఆశించినంత లాభం ఉండటం లేదు. అందుకే కూరగాయల సాగు చేస్తున్నాను. 1.93 ఎకరాల్లో వంగతోట వేశాను. తుపాను కారణంగా ఎకరం పొలంలో మొక్కలు చనిపోయాయి. ప్రభుత్వం కూరగాయల పంటలకు రాయితీలివ్వాలి.

– దేవిశెట్టి శ్రీను, రైతు, సింగంపల్లి

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



రెండెకరాల భూమిలో దొండ, కాకర(పందిర్లు) సాగు చేస్తున్నాను. తుపాను కారణంగా అధిక వర్షాలకు ఎకరం విస్తీర్ణంలో పంట పోయింది. ప్రభుత్వం ఆదుకుంటుందన్న నమ్మకముంది. పండించిన కూరగాయలకు ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

– బొంతు దుర్గాప్రసాద్, రైతు, రంగంపేట

విత్తనాలకు రూ.3 వేల రాయితీ



కూరగాయ పంటలు సాగు చేసే రైతుల కోసం ప్రభుత్వం విత్తనాలపై ఒక హెక్టారుకు రూ.3 వేల వరకూ రాయితీ కల్పిస్తోంది. హైబ్రీడ్ వెజిటబుల్ కల్టివేషన్ స్కీం ద్వారా రాయితీలున్నాయి. తీగజాతి కూరగాయలు పండించే రైతులకు శాశ్వత పందిర్లకు గాను ఎకరాకు రూ.లక్ష రాయితీ వస్తుంది.

– కె.దివ్యశ్రీ, హార్టీకల్చర్ అధికారి, రంగంపేట

26న దత్త జయంతి

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 26న దత్త జయంతి వేడుక జరగనుంది. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఆలయంలో ఉన్న దత్తాత్రేయునికి అభిషేకాలు నిర్వహిస్తారు. స్థానిక భక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం 6.30 నుంచి గురు చరిత్ర పారాయణ ప్రారంభమవుతుంది. మధ్యాహ్న హారతి అనంతరం అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 4.30కు గ్రామంలోని ప్రధాన వీధులలో సాయి పల్లకీ ఉత్సవం జరుగుతుందన్నారు. షిరిడీలో మాదిరిగా భక్తులే బోయీలుగా ఈ పల్లకీ సేవ జరుగుతుంది.

మండలానికి అయోధ్య రాముని అక్షతలు

రంగంపేట: అయోధ్య రాముని అక్షతలు మండలానికి చేరుకున్నాయని మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరాం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షతలను ప్రతీ గ్రామానికి అందిస్తామన్నారు. గ్రామాల్లో అయోధ్య నిధి సేకరణ కమిటీ సభ్యులు, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ సభ్యులు బృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సమరసత జోనల్ కన్వీనర్ సింగన సత్తిబాబు, సీతారామ మహిళా భజన సమాజం, వీహెచ్‌పీ సభ్యులు విష్ణుమూర్తి, గోపి, గాయత్రి పాల్గొన్నారు.

పెన్షనర్లు సమాజ అభివృద్ధికి తోడ్పడాలి



పెన్షనర్లను సత్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవంతో సమాజాభివృద్ధికి తోడ్పడి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి యూనిట్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పీవీఎన్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా పెన్షనర్ల పితామహుడు దరమ్ స్వరూప్ నకారా, జస్టిస్ చంద్రచూడ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షనర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి విలువైన స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.9 లక్షలు నిధులు అందించామన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. పెన్షనర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం 2024 పెన్షనర్స్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగుర్రెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఉత్సవాలకు రాట ముహూర్తం



పందిరి రాటను ఏర్పాటు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో వేంచేసివున్న భక్తాంజనేయస్వామి వారి తీర్థం, ఉత్సవాలకు సంబంధించి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు జరిపి ఆలయ ప్రాంగణంలో పందిరి రాట ముహూర్తం ఆదివారం నిర్వహించారు. ఏటా కనుమ రోజున స్వామి వారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. సంక్రాంతిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు స్వామి వారి జాతర, తీర్థ మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పందిరి రాట ముహూర్తం సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు భక్తాంజనేయస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఎన్‌డీఆర్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి దొరయ్యరెడ్డి, పార్టీ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరిసాయి కృష్ణారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

23న ఉత్తర ద్వార దర్శనం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వేంకటేశ్వరనగర్‌లో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23 శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 4.30 నుంచి ఉత్తర ద్వార(వైకుంఠ ద్వారం) దర్శనం జరుగుతుంది. గొండేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొండేశి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో అర్చకుల ఆధ్వర్యంలో జరుగుతుందని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. మధ్యాహ్నం స్వామివారి పల్లకీ ఊరేగింపు ఉంటుందన్నారు.

క్షతగాత్రులపై జక్కంపూడి ఔదార్యం



బాధితులకు ధైర్యం చెబుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

కడియం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకులను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆస్పత్రికి తరలించి కాపాడారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి కడియపులంక సెంటర్‌లో మోటార్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో అటుగా వెళుతున్న జక్కంపూడి విజయలక్ష్మి వీరిని చూసి కారు ఆపారు. స్వయంగా బాధిత యువకులకు ధైర్యం చెప్పి, అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తన వ్యక్తిగత సిబ్బంది సాయంతో క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కించారు. సంబంధిత వైద్యులతో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

వరకట్నం కేసు నమోదు

సీతానగరం: తనను కట్నం కోసం వేధిస్తున్నారంటూ బొబ్బిల్లంకకు చెందిన ఇసకోట శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2020లో కాకినాడకు చెందిన వీరవెంకట శివకుమార్‌తో ఆమెకు వివాహమైంది. వరకట్నం రూ.5 లక్షలు తీసుకురావాలని భర్త శివకుమార్‌తో పాటుగా అత్త, మావయ్య, ఇద్దరు ఆడపడుచులు, వారి భర్తలు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. ఈ మేరకు శిరీష శనివారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



అపూర్వ కలయికలో పాల్గొన్న 1993 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ ఆనంద డోలికల్లో తేలియాడారు. జ్ఞాపకాల దొంతరలను నెమరువేసుకుంటూ రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. తమ కుటుంబ సభ్యుల వివరాలతో పాటు వారంతా ఏయే వృత్తుల్లో స్థిరపడ్డారో సభాముఖంగా తెలియజేశారు. అనంతరం పిల్లలు, పెద్దలకు విడివిడిగా వివిధ విభాగాల్లో ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పదో తరగతి పూర్తయి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అందరికీ షీల్డులు ఇచ్చారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

విశ్వ నగరంగా అభివృద్ధి చెందాలి

ఎంపీ మార్గాని భరత్ ఆకాంక్ష



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్

సీటీఆర్ఐ: భవిష్యత్తులో రాజమహేంద్రవరాన్ని విశ్వ నగరంగా చూడాలన్నదే తన ఆకాంక్ష అని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో రజక సోదరులు కూడా భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని త్రీటౌన్ పోలీసు స్టేషను ఎదురుగా శేషయ్య మెట్ట వద్ద జరిగిన రాజమహేంద్రవరం పట్టణ రజక సేవా సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రజక సోదరులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని, అందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రజకుల ఉన్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. నూతన అధ్యక్షుడు బొమ్మదేవర శ్రీనివాస్‌కి, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలు విజయలక్ష్మి, ఎస్వీ శ్రీనివాస్, పీత రామకృష్ణ, రజక సంఘ ప్రముఖులు నందమూరి శ్రీనివాస్, మల్లెల శ్రీనివాసరావు, అత్తిలి ఉమా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



పందలపాకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



వల్లీదేవసేనతో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరుడు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



కొమరిపాలెం కావడి ఉత్సవంలో భాగంగా నిర్వహించిన గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ప్రసిద్ధి చెందిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణం అర్చకులు కె.మల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఈ నెల 18వ తేదీన షష్ఠి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్వామికి ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ గండి వాసు, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, కర్రి ఇస్రారెడ్డి, పాలచర్ల అబ్బు, ఆలయ ఈఓ కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో పాల కావడి ఉత్సవం

మండలంలోని కొమరిపాలెం నెమలి ఆలయంలో కొలువై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి ఉత్సవాలను పురస్కరించుకుని పాల కావడి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పౌల్ట్రీ యాజమానుల సంఘం అధ్యక్షుడు కర్రి ముకుందరెడ్డి, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల కావడి ఉత్సవాన్ని ప్రారంభించారు. ద్రవిడ విధానంలో పళని సంస్కృతి ప్రకారం షష్ఠి ముందు రోజు పాల కావడితో గ్రామోత్సవం చేశారు. దీంట్లో భాగంగా 116 కలశాలతో గోదావరి జలాలను బిందెలతో తెచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. మురుగన్ మాలధారులు స్వామి వారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు.

సుబ్రహ్మణ్య షష్ఠికి ఘనంగా ఏర్పాట్లు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రంగులు వేసి, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. షష్ఠి సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం జరిగే తీర్థ మహోత్సవానికి మండల పరిధిలోని ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

రాజానగరం: రావుల చెరువు గట్టున వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని 97వ షష్ఠి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. షష్ఠి రోజున స్వామి వారిని దర్శించుకునేందుకు రాజానగరంతో పాటు పరిసర గ్రామాల నుండి భక్తులు భారీగా తరలిస్తారు. ఈ కారణంగా ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు రాజానగరంలోకి ప్రవేశించేందుకు వీల్లేకుండా జాతీయ రహదారిపై సూర్యారావుపేట జంక్షన్ వద్ద, ఏడీబీ రోడ్డు పై ఉన్నత పాఠశాల సెంటరులోను స్టాపర్లను ఏర్పాటు చేసి, రూటును మళ్లించనున్నారు.

నాగుల చీరలతో ఉపవాస దీక్షలు

సంతానాన్ని ప్రసాదిస్తాడనే నమ్మకంతో షష్ఠి రోజున మహిళలు నాగుల చీరలు ధరించి, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణంలో ఉపావాస దీక్షతో ఉంటారు. సాయంత్రం స్వామివారి కల్యాణం అయ్యాక తలంబ్రాలను చీర కొంగులతో పట్టుకుని, వాటితో పరమాన్నాన్ని చేసి, ఉపవాస దీక్షను విరమిస్తారు. అవివాహితులు కూడా స్వామి దర్శనాన్ని చేసుకుంటే పెళ్లి అవుతుందనే నమ్మకం కూడా ఉంది. ఈ నేపథ్యంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. అలాగే మండలంలోని కానవరం, శ్రీకృష్ణపట్నంలో కూడా సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు కన్నుల పండుగగా జరగనున్నాయి.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల, సీతానగరం ఆలయాల్లో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సీతానగరం శివాలయంలో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో వలవల సత్తిబాబు, తులసీ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కొడమంచిలి రాము కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముగ్గళ్ల శివాలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఈఓ సోమాల శివ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

ధవళేశ్వరం: జీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత గాలి సుబ్బరాజు ఆధ్వర్యంలో ఆదివారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ సందర్భంగా పేదలు, హెచ్ఐవీ బాధితులు, కొవ్వూరు అంధుల పాఠశాలకు నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సుదర్శన్ షాపింగ్ మాల్ అధినేత లాలేటి సుదర్శన్, గాలి హేమంత్‌కుమార్, గాలి సంపత్, సంతోష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు స్వెట్టర్ల పంపిణీ

ధవళేశ్వరం: ధవళేశ్వరం పంచాయతీలో పనిచేస్తున్న 80 మంది పంచాయతీ కార్మికులకు జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆదివారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. మహేష్ జన్మదినం సందర్భంగా పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లను అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరి వీధికి చెందిన తోట ప్రసాద్‌కు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

షిర్డీ సాయి పంచాయతన క్షేత్రంలో ప్రత్యేక పూజలు

కడియం: మురమండలోని షిర్డీసాయి పంచాయతన క్షేత్రం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం కాకడ హారతి, మేలుకొలుపు, దేవతామూర్తుల అలంకరణలో జరిగాయి. అనంతరం సాయిబాబా వారికి పంచామృతాభిషేకాలు, చక్రసహిత రాజరాజేశ్వరి దేవికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. పల్లకీ మహోత్సవం, సాయినామ సంకీర్తనలు, లలితా సహస్రనామ సంకీర్తనలు నిర్వహించారు.